సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం। 15। ఏప్రిల్। 2023



జగనన్న పాలనకు నీరాజనం
ప్రజలంతా జగనన్నే మళ్లీ సీఎం కావాలని, సంక్షేమం కొనసాగాలని కోరుకుంటు న్నారని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు. IIలో



మే ఫ్లవర్ కనువిందు
సాక్షి, పాడేరు: హుకుంపేట మండలంలోని కొట్నాపల్లిలో ఓ గిరిజనుడి ఇంట మే పుష్పాలు ముందుగానే వికసించాయి.



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
యోగా అలవర్చుకుని వైద్య ఉద్యోగులంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా కోరారు. IIలో

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:
ఇఫ్తార్ (శని) 6-16 సహర్ (ఆది) 4-24
రంపచోడవరం:
6-28 4-27

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

- దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయి
- కులమతాలకు అతీతంగా రాజ్యాంగ ఫలాలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- వాడవాడలా ఘనంగా జయంతి వేడుకలు



పాడేరులోని కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: బడుగుల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆయన 132వ జయంతిని స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్, ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని కులమతాలకు అతీతంగా రాజ్యాంగ ఫలాలు అందాలనే మంచి ఆశయంతోభారత రాజ్యాంగ నిర్మాణానికి కృషి చేశారన్నారు.అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం దేశంలో ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. జేసీ శివశ్రీనివాస్,ఎంపీపీ ఎస్,రత్నకుమారి, ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామసత్యవతి, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు పాల్గొన్నారు. ఐటీడీఏ సమావేశమందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకరరావు,వెంకటేశ్వరరావు,ఏవో హేమలత పాల్గొన్నారు.

అంబేడ్కర్ సెంటర్‌లో...

పాడేరులోని పాతబస్టాండ్ అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి అన్ని రాజకీయ పార్టీల నేతలు,గిరిజన ఉద్యోగ,ఉపాధ్యాయ,ప్రజాసంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు,ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ మత్స్యరాస వెంకటలక్ష్మి, పాడేరు ఎంపీపీ ఎస్,రత్నకుమారి పూలమాలలు వేశారు.

రంపచోడవరం: ఐటీడీఏ సమావేశ మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయన్నారు. ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావు, ఏవో డీఎస్‌వీ రమణ పాల్గొన్నారు. ఇర్లపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. జిల్లా వీఆర్వోల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు మిర్తివాడ గణపతిరెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.ఆదివాసీ మహాసభ ఆధ్వర్యంలో పీఎంఆర్‌సీలో జయంతి వేడుకలు నిర్వహించారు.

నవశకానికి నాంది పలికిన ఆశాజ్యోతి

అడ్డతీగల: సమాజంలో అట్టడుగు వర్గాలను పట్టిపీడిస్తున్న వెనుకబాటుతనాన్ని పారదోలేలా రాజ్యాంగ రచనతో నవశకానికి నాందిపలికిన ఆశాజ్యోతిగా డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ నిలిచారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అడ్డతీగలలో శుక్రవారం జైభీమ్ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ బి. రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, స్థానిక సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, జైభీమ్ సేవా సంఘం అధ్యక్షుడు చీకట్ల శామ్యూల్ నివాళులు అర్పించారు.



రంపచోడవరంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



ఉప్పలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద విద్యార్థులతో కలిసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అడ్డతీగలలో పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి



పాడేరు ఐటీడీఏలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా

సాక్షి, పాడేరు: అగ్ని ప్రమాదాల పట్ల జిల్లాలోని అన్నివర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటంతో పాటు అగ్ని ప్రమాదాల నివారణలో అమరులైన అగ్నిమాపక అధికారులు,సిబ్బంది ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారోత్సవాలకు సంబంధించిన అగ్నిమాపక కేంద్రం ప్రచార వాహనానికి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల సమయంలో అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందించి ప్రజల ఆస్తులు, ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారన్నారు. విధి నిర్వహణలో అమరులైన వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా అగ్ని మాపక వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ శివశ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పాలిసెట్ దరఖాస్తుకు ఈనెల 30 వరకు గడువు

ఎటపాక: పాలిసెట్– 2023కు ఈనెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎటపాక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ కళాశాల ప్రిన్సిపాల్ రామసత్యనారాయణ శుక్రవారం తెలిపారు. నేటితో పదవ తరగతి పరీక్షలు ముగుస్తున్నందున పాలిసెట్‌కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. వచ్చే నెల 10వ తేదీన పాలిసెట్ పరీక్ష జరుగుతుందన్నారు. ఈఏడాది ఎటపాకతోపాటు చింతూరులో కూడా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో కోఎడ్యుకేషన్, డేస్కాలర్ సదుపాయం, హాస్టల్ వసతి సౌకర్యం ఉన్నాయని తెలిపారు. పరీక్ష రాయనున్న విద్యార్థులకు చింతూరు ఐటీడీఏ సహకారంతో ఈనెల 16 నుంచి ఎటపాక పాల్‌టెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ, భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరకు ఎంపీ మాధవి

చింతపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 17 నుంచి జరగనున్న ముత్యాలమ్మ జాతరకు అరకు ఎంపీ మాధవిని ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. ఈ మేరకు విశాఖలోని ఆమె నివాసంలో శుక్రవారం ఆహ్వాన పత్రికను ఉత్సవ కమిటీ ప్రతినిధులు అందజేశారు. అనంతరం ఉత్సవ పోస్టర్‌ను ఆమె చేతులమీదుగా ఆవిష్కరింపజేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హేమంత్, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు తెలిపారు.

గింజర్తి వంతెన పనులు ప్రారంభం



పూజలు చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, స్థానికులు

కొయ్యూరు: మండలంలోని చింతలపూడి పంచాయతీ గింజర్తి గిరిజనులు పదేళ్లుగా పడుతున్న కష్టాలు తీరనున్నాయి.గింజర్తి కాలువపై రూ.80 లక్షలతో వంతెన నిర్మాణానికి శుక్రవారం చింతలపూడి ఎంపీటీసీ పాడుగు రత్నం , సర్పంచ్ సెగ్గే రమాదేవి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో కాలువ ఉధృతంగా ప్రవహించడం వల్ల రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు.వంతెన నిర్మాణం పూర్తయితే ఇలాంటి ఇబ్బందులు రావని తెలిపారు. గింజర్తి మీదుగా ఆడాకుల, ఆర్.కొత్తూరు, కంతారం, బాలారం, కొమ్మిక, బకులూరు పంచాయతీలకు చెందిన 30 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తారని తెలిపారు. వంతెన నిర్మాణానికి కృషి చేసిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ మాధవికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్వాసితుల సమస్యలపై సీపీఐ పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

ఎటపాక: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మూడు రోజుల జనచైతన్య పాదయాత్ర చేపట్టారు.శుక్రవారం మురుమూరు గ్రామం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ మాట్లాడుతూ ఎటపాక మండలాన్ని ముంపు జాబితాలో చేర్చాలని కోరారు. కంటె రాజు,పార్టీ మండల కార్యదర్శి నాగరాజు, వాసం రాము, సత్యనారాయణ, పాపారావు, మెహబూబ్, రాఘవులు, ముత్తయ్య పాల్గొన్నారు.

ప్రజాసేవలో నిరంతరం పోలీసుశాఖ

- సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ యాదవ్
- గిరిజనులకు సోలార్‌లైట్ల పంపిణీ



కొత్తసుజనకోటలో గిరిజనులకు సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న కమాండెంట్ యాదవ్

ముంచంగిపుట్టు: ప్రజాసేవలో నిరంతరం పోలీసుశాఖ ముందు ఉంటుందని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఎస్.ఎన్.యాదవ్ అన్నారు. మండలంలోని సుజనకోట పంచాయతీ కొత్తసుజనకోట గ్రామంలో శుక్రవారం స్థానిక సీఆర్‌పీఎఫ్ ఈ–198 బెటాలియన్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే ఆదేశాల మేరకు సివిల్ యాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. సుజనకోట, కొత్తసుజనకోట, సుజనపేట, కుమ్మరిపుట్టు, దోనిపుట్టు, మినుములపుట్టు గ్రామాలకు చెందిన 160 మంది గిరిజనులకు సోలార్ లైట్లను సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఎస్.ఎన్.యాదవ్, సర్పంచ్ వి.రమేష్, ఎంపీటీసీ ఎం.సుబ్బలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ కమోండర్ ఎస్.ఎన్.యాదవ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ముఖ్యంగా గిరిజన యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కల్పించే ఉద్యోగ,ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తామన్నారు. పోలీసులతో గిరిజనులు మైత్రీ సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జశ్వంత్‌సింగ్, ఏఎస్‌ఐ తిరుపతిరావు పోలీసులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

- తొలిసారిగా ఇంటర్నేషనల్ మెగా జాబ్ ఫెయిర్
- స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్

సాక్షి,పాడేరు: విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్నందున తొలిసారిగా ఇంటర్నేషనల్ మెగా జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నామని ఏపీఎస్‌డీసీ స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి జి.ప్రశాంత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో ఉద్యోగం ఓ కలగా మిగిలిపోకుండా, ఎంప్లాయిర్ లేక కంపెనీలతో నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 7వతరగతి నుంచి ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఐటీఐ అర్హత ఉండి18నుంచి 40ఏళ్ల వయసు ఉన్న స్త్రీ,పురుష అభ్యర్థులు విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.దరఖాస్తుల ప్రక్రియ,ఇంటర్వ్యూలు,ఇతర సమగ్ర వివరాలకు ఏపీఎస్‌ఎస్‌డీసీ కో–ఆర్డినేటర్ నవీన్,9491786463,ఏపీఎస్‌ఎస్‌డీసీ టోల్ ఫ్రీ నెంబర్,91–9988853335ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



రహదారిపై విరిగి పడిన పనస చెట్టు



రాజేంద్రపాలెంలో దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహం

అరకులోయ రూరల్: మండలంలో పలుచోట్ల ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. మాడగడ పంచాయతీ చంపగూడ గ్రామ సమీపంలో రహదారిపై పనస చెట్టు విరిగి పడింది దీంతో బస్కి పంచాయతీ మార్గంలో ప్రయణించే వాహనదారులు, ఇబ్బందులుపడ్డారు. కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానికులు తొలగించడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహం

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో గుడ్లపల్లి జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహం గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులకు దెబ్బతింది. పక్కనే ఉన్న చెట్టు కూలడంతో విగ్రహం పడిపోయింది. స్టేజీ పాడైంది. అంబేడ్కర్ విగ్రహాన్ని యథావిధిగా ఉంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇలావుండగా రాజేంద్రపాలెం జంక్షన్‌లో చెట్టును పూర్తిగా తొలగించకపోవడంతో కొయ్యూరు నుంచి బూదరాళ్ల వెళ్లే బస్సు రాకపోకలు నిలిచిపోయాయి. చెట్టును కొంతవరకు మాత్రమే తొలగించడంతో ఆటోలు మాత్రమే వెళ్తున్నాయి.

పోటీకి దిగితే పతకమే!

మారథాన్‌లో రాణిస్తున్న సచివాలయ ఉద్యోగి గోపి



సాధించిన పతకాలతో కొర్రా గోపి

అనంతగిరి: అనుకున్న లక్ష్యం సాధించాలని అందరికీ ఉంటుంది. వాటిని అధిగమించి ఆ దిశగా అడుగులు వేసేది కొంతమంది మాత్రమే. అలాంటివారిలో గిరి యువకుడు కొర్రా గోపి ఒకరు. మండలంలోని రొంపలి గ్రామసచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. లక్ష్య సాధనకు ఆహర్నిశలు శ్రమిస్తూ, కఠోర సాధన చేస్తూ, మారథాన్ పోటీల్లో విజయమే లక్ష్యంగా దూసుకుపోతున్నాడు. వచ్చేనెల బెంగళూరులో జరిగే ప్రపంచస్థాయి 10కె రన్ మారథాన్ పోటీలకు ఎంపికయ్యాడు.

- జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 10కె, 5కె రన్ మారథాన్ పోటీల్లో బంగారు, వెండి పతకాలను సాధించాడు. ఆర్థిక సమస్యలను అధిగమించి తనకు ఇష్టమైన రంగంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాడు. ఇప్పటివరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ మారథాన్ పోటీల్లో 52 బంగారు, వెండి 58 పతకాలను సాధించాడు.
- మహారాష్ట్ర పుణేలో గత నెల 26 నుంచి 29 వరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 10కె రన్‌లో 8వ స్థానం, 5కె రన్‌లో 10వ స్థానంలో నిలిచాడు. ఏపీ తరఫున ఈపోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు.
- ఈనెల రెండున విజయవాడలో అహింస జీతో ఆల్ అవర్ ఇండియా మారథాన్ 10 కే మారథాన్ పోటీల్లో 3వస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు.



జాతీయస్థాయి మారథాన్ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచిన కొర్రా గోపి

ప్రోత్సహించాలని వినతి

జిల్లా అధికారులు, దాతలు ముందుకు వచ్చి ప్రోత్సహిస్తే మారథాన్ పోటీల్లో మరింత రాణిస్తా. దేశం తరఫున పాల్గొని సత్తా చాటతా. లక్ష్య సాధనకు ఆర్థిక ఇబ్బందులు వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. సహకారం అందించి ఆదుకోవాలి.

– కొర్రా గోపి, క్రీడాకారుడు, వెల్ఫేర్ అసిస్టెంట్, రొంపల్లి గ్రామసచివాలయం

19, 21 తేదీల్లో జైలులో వేలం పాట

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో డెయిరీ ఫారంలో ఉన్న ఆవులు, గేదెలు, దూడలతో పాటు ఇక్కడున్న మామిడి చెట్ల పంటను వేలం వేయనున్నట్టు జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెయిరీలో ఉన్న 22 మగ, ఆడ పశువులను ఈ నెల 19న కారాగారం ఆవరణలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 19న ఉదయం 10 గంటలకు జైల్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుని ముందుగా రూ.1500 డిపాజిట్ చేయాలన్నారు. దీంతో పాటు జైలు ఆవరణలో ఉన్న మామిడి చెట్ల పంటకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జైల్ పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ వేలం వేయనున్నామన్నారు. మామిడి పంటను ఐదేళ్లకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సమయానికి వచ్చి రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు.

ఆశాజనకంగా జీడిమామిడి

- కనిపించని టి దోమ ప్రభావం
- కిలో రూ.85 నుంచి రూ.110తో కొనుగోలు



పాడేరు మండలం వంట్లమామిడి ప్రాంతంలో విరగ్గాసిన జీడిమామిడి

సాక్షి,పాడేరు: జిల్లాలో ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు జీడిమామిడి రైతులకు కలిసొచ్చాయి. టి.దోమ ప్రభావం లేకపోవడంతో కాపు ఆశాజనకంగా ఉందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని రంపచోడవరం, దేవీపట్నం, రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, కొయ్యూరు, చింతపల్లి, పాడేరు, హుకుంపేట, పెదబయలు, అరకులోయ, అనంతగిరి, ముంచంగిపుట్టు మండలాల్లో సుమారు 25 వేల హెక్టార్లలో జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఎకరాకు కనీసం 250 కిలోలు దిగుబడి వస్తున్నందున రైతులకు మంచి ఆదాయం పొందుతున్నారు. ఈఏడాది జిల్లా వ్యాప్తంగా జీడిపిక్కల వ్యాపారం జోరందుకుంది.

- పాడేరు మండలంలోని వంట్లమామిడి,దేవాపురం , సలుగు,ఐనాడ పంచాయతీల పరిధిలో జీడిపిక్కలను కిలో రూ.100నుంచి రూ.110తో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అనంతగిరి,అరకులోయ, ముంచంగిపుట్టు,పెదబయలు,కొయ్యూరు ప్రాంతాలలో కిలో రూ.85నుంచి రూ.95తో వ్యాపారం జరుగుతోంది.
- రాజవొమ్మంగి, రంపచోడవరం ప్రాంతాల్లో మాత్రం జీడిపిక్కలకు గిట్టుబాటు ధర గతేడాది కన్నా తక్కువగా ఉంది.కిలో రూ.85నుంచి రూ.90 మధ్యనే జీడిపిక్కల ధరలు ఉన్నాయి.

గతేడాదికన్నా తగ్గిన ధర



జీడిపిక్కల అమ్మకాలను ప్రారంభించాం.గత ఏడాది కన్నా కొనుగోలు ధర తగ్గింది. కిలో రూ.80 నుంచి 90కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

– లోతా ఎర్రయ్య, కిమ్మిలిగెడ్డ , రాజవొమ్మంగి మండలం

దిగుబడి బాగుంది



ఈఏడాది జిల్లాలో జీడిమామిడి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి.టి దోమ ప్రభావం లేకపోవడంతో జీడితోటలకు మేలు చేసింది.ఒక్కో ప్రాంతంలో వేర్వేరు ధరలతో జీడిపిక్కలను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

– రమేష్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి

ముత్యాలమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు

చింతపల్లి: మండల కేంద్రంలో నిర్వహించే ముత్యాలమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 20 వరకు ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నడూలేనివిధంగా విద్యుత్ దీపాలతో చింతపల్లిని అలంకరిస్తున్నారు. మెట్టబంగ్లాలోని సాయిబాబా ఆలయం వద్ద నుంచి సంతబయలు వరకు సుమారు కిలోమీటరు మేర రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు, భారీ సెట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. హనుమాన్ జంక్షన్ నుంచి సెయింట్ ఆన్స్ పాఠశాల వరకు విద్యుత్ దీపాల అలంకరణ చేస్తున్నారు. నూతనంగా పునర్నిర్మించిన గర్భగుడిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణకు రెండు చోట్ల స్టేజీలు ఏర్పాటు చేస్తున్నారు.



విద్యుత్ సెట్టింగ్‌ల కోసం ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ప్రతిఒక్కరూ సహకరించాలి

చింతపల్లిరూరల్: ముత్యాలమ్మ జాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సూచించారు. శుక్రవారం జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఉత్సవ కమిటీ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపడతామన్నారు. జాతరకు వచ్చే వాహనాలు ఎక్కడ నిలిపి వేయాలన్న దానిపై కమిటీ సూచించాలన్నారు. భారీ బందోబస్తుతో పాటు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. సీఐ రమేష్, ఎస్ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

సాక్షి, పాడేరు: యోగా అలవర్చుకుని వైద్య ఉద్యోగులంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా కోరారు. మండలంలోని మినుములూరు హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రంలో అయిష్మాన్ భారత్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో, వైద్యులు, వైద్యసిబ్బంది అంతా యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిత్యం అప్రమత్తంగా ఉండే వైద్యబృందాలు మానసిక ఒత్తిడికి గురికావొద్దన్నారు. యోగా కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని,యోగా అలవాటు చేసుకుంటే ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్,ఇతర వైద్యబృందాలు పాల్గోన్నాయి.

ఆలయంలో చోరీ

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డులో లింగ రాయి గుడిలోని మూడు హుండీలను దొంగలు అపహరించారు. గుడి ఆవరణలో ఉన్న మూడు హుండీలను గురువారం అర్ధరాత్రి దాటాక తీసుకువెళ్లి సమీపంలోని కొబ్బరితోటలో పడేసి, వాటిలో ఉన్న నగదును ఎత్తుకుపోయారు.శుక్రవారం హుండీలు చోరీకి గురైనట్టు స్థానికులు గుర్తించారు.ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము ఎస్‌ఐ మహమ్మద్ ఆలీకి సమాచారం అందజేశారు. రూ.8వేలకు పైగా నగదు చోరీ జరిగినట్టు భావిస్తున్నారు.

జగనన్న పాలనకు నీరాజనం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



గిరిజనులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: ప్రజలంతా జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమం కొనసాగాలని కోరుకుంటున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో పెదలోచలి పంచాయతీ కేంద్రం జర్రాయి గ్రామాల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం', 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో 237 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయటం, వాటిని అర్హులకు పారదర్శకంగా అందించటంతో ప్రతీ గడప నుంచి నీరాజనాలు లభిస్తున్నాయన్నారు. జగనన్న అందిస్తున్న సుపరిపాలన దేశానికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకోనే బాధ్యతను వ్యక్తిగతంగా తీసుకుంటున్నామని ప్రజలు నిర్ణయానికి వచ్చారన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం స్టిక్కర్లను ఆయా ఇంటి యజమానుల అనుమతితోనే అంటించారు. పెదలోచలి సర్పంచ్ బొడిగి చిన కుమారి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, జి.మాడుగుల సర్పంచ్ కిముడు రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండం నాయుడు, ఎంపీటీసీ పాంగి లక్ష్మి, సచివాలయ మండల కన్వీనర్ కళ్యాణం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్టి కొండబాబు, నాయకులు చిట్టిబాబు, మత్స్యం నాయుడు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంలో స్వచ్ఛభారత్



కొత్తపల్లి జలపాతం వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: మండలంలో కొత్తపల్లి జలపాతం పరిసరాలను వాటర్ ఫాల్స్ మేనేజర్ నవీన్ సూపర్‌వైజర్ అభి ఆధ్వర్యంలో సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ అదేశాల మేరకు ప్లాస్టిక్ రహిత టూరిజం ప్రాంతంగా చేయటానికి అందరు చెత్తచెదాలను తొలగించారు. టూరిజం ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచటానికి మైదాన ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు సహకరించాలని వారు కోరారు. కొత్తపల్లి జలపాతాన్ని, పరిసరాలను శుభ్రంగా ఉంచటానికి నిర్వహాకులు దృష్టి సారించి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాటర్ ఫాల్స్ నిర్వహాకులు రాజు రవి, సూరిబాబు, కృష్ణారావు, వెంకటరావు, చంటి,సురేష్, బాబూరావు, అనిల్, అప్పారావు శ్రీను, జానీబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి విశాఖ ట్రోఫీ ఫుట్‌బాల్

విశాఖ స్పోర్ట్స్ : మూడుదశాబ్దాల విరామం అనంతరం విశాఖ ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు నగరంలో జరగనున్నాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న పోటీలకు రైల్వేస్టేడియం సిద్ధమైంది. ట్రోఫీలో 16 జట్లు నాలుగు పూల్స్‌లో తలపడనున్నాయి. రోజు రెండు మ్యాచ్‌లు జరగనుండగా 23వ తేదీన ఫైనల్ జరగనుంది. విజేతకు లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు ప్రోత్సాహకాన్ని అందుకోనున్నారు. సునేబేడా, బ్లూస్టార్స్, మధ్యప్రదేశ్, ఏపీ, చెన్నై, విశాఖ, హైదరాబాద్, సిటీఎఫ్‌సీ, నాగపూర్, శ్రీధర్ స్పోర్టింగ్, ఎస్ఎఫ్ఎ, కోల్‌కతా, ఎస్‌పటీ, బర్గా, చత్తీస్‌గఢ్, డైచిమన్ ఫుట్‌బాల్ క్లబ్ జట్లు తలపడనున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో సునబేడా జట్టుతో బ్లూస్టార్స్ జట్టు తలపడనుంది.

అగ్నితో అప్రమత్తం



వారోత్సవాలను ప్రారంభిస్తున్న లక్ష్మణస్వామి



అగ్నిప్రమాదాల్లో అసువులు బాసిన ఉద్యోగులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

● వేసవిలో ప్రమాదాలకు ఆస్కారం
● జిల్లా ఫైర్ అధికారి లక్ష్మణస్వామి
● అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

అనకాపల్లి టౌన్: మానవ తప్పిదాల వల్ల కొన్ని ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి బి.లక్ష్మణస్వామి తెలిపారు. స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతి రోజూ పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రమాదాల నివారణ బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం అగ్ని ప్రమాదాల్లో మృతిచెందిన అగ్నిమాపకశాఖ సిబ్బంది ఎస్‌హెచ్.వాసుదేవ్ సదాశివ(గోవా), ప్రవీణ్ కుమార్(ఢిల్లీ), లిథిన్ సింగ్(ఉత్తరాఖండ్)కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి అగ్నిమాపకశాఖ అధికారి బి.నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



శ్రీనివాసుని కల్యాణంలో ఆహోబిలం జీయర్‌స్వామి

● ఆహోబిలం జీయర్‌స్వామి నేతృత్వంలో వేడుక

యలమంచిలి: మండలంలోని ములకలాపల్లి వద్ద మైహోమ్ ఇండస్ట్రీస్ (సిమెంట్ కర్మాగారం)లో శ్రీనివాస కల్యాణ మహోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. శ్రీలక్ష్మీ సమేత శ్రీనివాసుని 11వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇక్కడ యాగశాలలో నిత్యారాధన, చతుస్థానార్చన, మూలమంత్ర, హవన పారాయణాధికాలు, గరుడ వాహన సేవ, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

ఈ కల్యాణ మహోత్సవంలో మైహోమ్ ఇండస్ట్రీస్ ఆధినేత జూపల్లి రామేశ్వరావు, కుమారి దంపతులు పాల్గొన్నారు. ఆహోబిలం జీయర్ స్వామి నేతృత్వంలో ఈ వేడుక జరిగింది. ఎమ్మెల్యే కన్నబాబురాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర కల్యాణ ఘట్టాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అంతకుముందు మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జూపల్లి వినోద్‌కుమార్, భార్గవి దంపతులు, దూది నరసింహమూర్తి, గంధం శివ, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడిన యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన సహదత్

యలమంచిలి: రైలు నుంచి జారిపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తుని రైల్వే ఎస్‌ఐ అబ్దుల్ మారుఫ్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి 11 గంటల సమయంలో యలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి సహదత్ (20) అనే యువకుడు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సహదత్ మృతి చెందాడు. ఈ యువకుడు బిహార్ రాష్ట్రం భాగాల్పూర్ జిల్లా ధనోరీ గ్రామం వాసిగా గుర్తించినట్టు రైల్వే ఎస్‌ఐ తెలిపారు. సహదత్ తమిళనాడు రాష్ట్రంలో హోటల్‌లో పనిచేస్తున్నాడని తల్లిదండ్రులను చూడడానికి స్వగ్రామానికి వెళుతూ రైలు నుంచి జారి పడి మృతి చెందాడని చెప్పారు. మృతుడి తండ్రి సిరాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్‌ఐ చెప్పారు.

పనుల్లో నాణ్యత లోపాలపై ఫిర్యాదు

అనంతగిరి: జీనబాడు పంచాయతీ నుంచి పినకోట, పెదకోట వరకు ఉన్న ప్రధాన రహదారిలో ఇటీవల ఆర్‌అండ్‌బీశాఖ సుమారు కోటి రుపాయలతో మరమ్మతు పనులు చేపట్టింది. అయితే పనుల్లో నాణ్యతలోపం కారణంగా రహదారిలోని గోతులమయంగా మారిందని పినకోట, పెదకోట సర్పంచ్‌లు గణేష్, అన్నపూర్ణ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన శుక్రవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి, రోడ్డు పనులను పరిశీలించారు. జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి, నాణ్యతలోపంపై ఆర్‌అండ్‌బీశాఖ డీఈఈకి ఫిర్యాదు చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులకు ఆదేశిస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. మార్కెట్‌యార్డు డైరెక్టర్ సూర్యనారయణ, నాయకులు నాగేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.



గోతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, సర్పంచ్‌లు గణేష్, అన్నపూర్ణ తదితరులు

సాహిత్య సంబరాలకు 'పిల్లా'కు ఆహ్వానం



వెంకట రమణమూర్తి

సీతంపేట(విశాఖ ఉత్తర): తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ సాహిత్య సంబరాలలో పాల్గొనాలని విశాఖకు చెందిన విశ్రాంత సంస్కృత అధ్యాపకుడు పిల్లా వెంకట రమణమూర్తికి ఆహ్వానం అందింది. రమణమూర్తి రచించిన కవిత సంకలనానికి ఎంపిక చేశామని, జాతీయ సాహిత్య సంబరాల సందర్భంగా విడుదల చేసే సంకలనంలో కవితను ప్రచురిస్తామని నిర్వాహకులు లేఖ ద్వారా తెలిపారు. సంకలనానికి ఎంపికైన కవులు, రచయితలకు సత్కారం, సాహిత్య పురస్కారం ప్రదానం చేయనున్నారు. జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో కవితా గానం చేసే అవకాశం కలిగిందని రమణమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

మోడరన్ ఫిష్ మార్కెట్ రెడీ

● హార్బర్‌లో రూ.2.75 కోట్ల వ్యయంతో నిర్మాణం
● 1,600 గజాల విస్తీర్ణంలో 120 సీట్ల సామర్థ్యం
● డిస్‌ప్లే టేబుళ్లు, కటింగ్, సింక్ ట్యాప్‌లు ఏర్పాటు
● ఇకపై పూర్తి పరిశుభ్ర వాతావరణంలో చేపలు లభ్యం
● వేట విరామం తర్వాత నుంచి చేపల అమ్మకాలు ప్రారంభం



ఫిష్ మార్కెట్ లోపల ఏర్పాటు చేసిన డిస్‌ప్లే టేబుళ్లు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఫిషింగ్ హార్బర్ రాష్ట్రంలోనే అతి పెద్ద చేపల రేవు. 1976లో ఏర్పాటైన ఈ హార్బర్ 64 ఎకరాల్లో విస్తరించి ఉంది. నిత్యం కొనుగోలు, అమ్మకందార్లతో కళకళలాడుతూ ఉంటుంది. అయితే చేపల క్రయవిక్రయాలకు సరైన సదుపాయం లేక ఏళ్ల తరబడి ఈ హార్బర్ అపరిశుభ్ర వాతావరణంతో సతమతమవుతోంది. ఎండ, వానల్లోనూ ఆరుబయటే జెట్టీపై బహిరంగంగా చేపల అమ్మకాలు, కొనుగోళ్ల జరపాల్సి వస్తోంది. ఇది ఇటు వర్తకులతో పాటు రిటైల్ కొనుగోలుదార్లకు చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ చేపల రేవులో అధునాతన ఫిష్ మార్కెట్ నిర్మాణాన్ని సంకల్పించింది. ఇందుకోసం రూ.2.75 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో 1,600 గజాల విస్తీర్ణంలో 120 సీట్ల సామర్థ్యం ఉండే మోడరన్ ఫిష్ మార్కెట్ సిద్ధమైంది. ఇటీవలే దీని నిర్మాణం పూర్తయింది. చేపలవేట విరామం పూర్తయ్యాక జూన్ 15 తర్వాత నుంచి ఈ కొత్త మార్కెట్ అందుబాటులోకి రానుంది.

ఫిష్ మార్కెట్లో సదుపాయాలివీ..

ఈ అధునాతన ఫిష్ మార్కెట్లో పలు సదుపాయాలున్నాయి. విక్రయించే చేపలను ఉంచడానికి డిస్‌ప్లే టేబుళ్లను అమర్చారు. ప్రతి స్టాల్‌కు సింక్ ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. ఇంకా చేపలను కోయడానికి వీలుగా కటింగ్ సదుపాయాన్ని కల్పించారు. చేపలు విక్రయించే వారు, కొనుగోలు చేసే వారి కోసం మంచినీరు, విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచారు. అంతేకాదు.. ఈ ఆధునిక చేపల మార్కెట్లో కూర్చునేందుకు వీలుగా కుర్చీలను సమకూర్చాలని విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యాన్ని మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే కోరారు. ఇందుకు ఆ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. ఈ మోడరన్ ఫిష్ మార్కెట్ అందుబాటులోకి వస్తే హార్బర్‌లో పరిశుభ్రమైన వాతావరణంలో చేపల క్రయవిక్రయాలు జరగడానికి వీలుంటుందని, దీనివల్ల నాణ్యత పెరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు.

బోట్ల వివరం	రిజిస్టరైనవి	నడుస్తున్నవి
మెకనైజ్డ్ బోట్లు	696	626
మోటారైజ్డ్ బోట్లు	450	405
బీచ్ ల్యాండింగ్ క్రాఫ్టస్ (బీఎల్‌సీ)	15	13
నాన్ మోటారైజ్డ్ సంప్రదాయ బోట్లు	150	135
మొత్తం	1,311	1,179

రూ.182 కోట్లతో ఆధునికీకరణ

విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను సాగరమాల పథకంలో రూ.182 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ చేపడుతున్నారు. ఇటీవలే వీటి పనులు కూడా మొదలు పెట్టారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లో నివేదించిన ప్రకారం.. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 1,311 వరకు వివిధ రకాల బోట్లున్నాయి. వీటిలో మరబోట్లు 696, మోటారైజ్డ్ బోట్లు 450, బీచ్ ల్యాండింగ్ క్రాఫ్ట్స్ (బీఎల్‌సీలు) 15, సంప్రదాయ బోట్లు (నాటు పడవలు) 150 ఉన్నాయి. వీటిలో 1,179 వరకు వేట సాగిస్తున్నాయి. వీటి ద్వారా రోజుకు సగటున ఈ చేపల రేవుకు 150 టన్నుల చేపలు వస్తున్నాయి. రోజుకు 33 ట్రక్కుల చొప్పున నెలకు వెయ్యి ట్రక్కుల్లో చేపల రవాణా జరుగుతోంది. రోజుకు 135 ద్విచక్ర వాహనాలు, 15 నాలుగు చక్రాల వాహనాలు వస్తుంటాయి.